www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | గురువారం అక్టోబర్ 22, 2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:230 | పేజీలు: 8 | వెల: రూ.5/-

సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తమ పార్టీకి ఎంతో బూస్ట్ ఇచ్చాయని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు నేపథ్యంలో 19 మున్సిపాలిటీలలో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ... నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. తమ వారిని నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, గందరగోళం సృష్టించడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు. అదే సమయంలో టీడీపీ నేతలు సులభంగా నామినేషన్లు వేసేందుకు పోలీసులు సహకరించారని విమర్శించారు.పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైసీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి, నోటీసులు జారీ చేస్తున్నారని పెద్దిరెడ్డి ఆరోపించారు.

ఢిల్లీలో ఈసీకి వ్యతిరేకంగా

నిరసన

- ఓటర్ల జాబితా ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసన
- ఆందోళనలో పాల్గొననున్న ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్
- ప్రకాశ్‌రాజ్, పలువురు ప్రముఖులతో కలిసి వేదిక పంచుకోనున్న ప్రభాకర్



తిరుమలలో

సాధారణ రద్దీ

- తిరుమలలో సాధారణ స్థాయిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 9 కంపార్ట్‌మెంట్లలో భక్తులు

తిరుమల,(నిజం చెపుతాం)

తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. టై మ్ స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భ క్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతోందని అధికా రులు తెలిపారు.



క్రిమినల్స్‌తో ఫ్రెండ్లీగా ఉండొద్దు

- చట్టాన్ని ఎదిరిస్తే ఎంతటి వారైనా వదలం
- 2027 చివరికల్లా మొత్తం పోలీసు పోస్టుల భర్తీ
- ఆహార కల్తీ అతి పెద్ద సమస్యగా మారింది
- పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం
- అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం
- సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడికి పటిష్ఠ చర్యలు

పోలీస్ అమరవీరుల కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

ప్రజలకు భరోసా కల్పిస్తూ, నేరగాళ్లపై కఠినం గా వ్యవహరించాలని తెలంగాణ పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఫ్రెం డ్లీ పోలీసింగ్ అంటే నేరస్తులతో స్నేహంగా ఉండటం కాదని, బాధితులు, సామాన్య ప్రజ ల పట్ల మాత్రమే స్నేహపూర్వకంగా వ్యవహరి ంచాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గో షామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం పాల్గొని అమరవీరులకు నివాళులర్పి ంచారు.క్రిమినల్స్, భూకబ్జాదారులు, డ్రగ్ పె డ్లర్ల విషయంలో పోలీసులు కఠినంగా వ్య వహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొ న్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, బా ధితులకు న్యాయం అందించేలా పోలీసు వ్యవ స్థ పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ నియం త్రణలో తెలంగాణ పోలీసు శాఖ పనితీరు బా గుందని సీఎం ప్రశంసించారు. ఈ రంగంలో రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ స్థాయిలో తొలి స్థానం సాధించిందని వెల్లడించారు.



ఆహార కల్తీపై ఉక్కుపాదం

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. టీజీ సేఫ్ కార్యక్రమం ద్వారా కల్తీ ఆహారంపై కఠిన చర్య లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సు రక్షితమైన ఆహారం అందేలా సంబంధిత శాఖ లు సమన్వయంతో పనిచేయాలని, ప్రజారో గ్యానికి ముప్పు కలిగించే చర్యలను ఉపేక్షిం చబోమనే సంకేతాన్ని ప్రభుత్వం ఇస్తోందని వి వరించారు.పోలీసు శాఖను మరింత బ లోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేప ట్టిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. మొత్తం 7, 437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చినట్లు తెలి పారు. ఇందులో 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

➤ మిగతా 2వ పేజీలో..

జగన్‌కు షాక్

- వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కడపలో ఆ పార్టీకి ఎదురుదెబ్బ
- రాయచోటి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు వంటి కీలక స్థానాలు టీడీపీ వశం
- నామినేషన్లను అడ్డుకున్నారంటూ వైసీపీ ఆరోపణలు



పులివెందులలో

దాడుల పర్వం

- పులివెందులలో వైసీపీ నేతల ఆస్తులపై దాడులు జరుగుతున్నాయన్న అవినాశ్ రెడ్డి
- చికెన్ సెంటర్, కౌన్సిల్ అభ్యర్థి చెక్ బుక్కులు తగలబెట్టారని తీవ్ర ఆగ్రహం
- భయపెట్టేందుకు 900 కేసులు పెట్టారని మండిపాటు



తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

- బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్
- రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాం టి గడువులు లేవని టీపీసీసీ అధ్య క్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ము ఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అ మలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు.ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కా దని, 2039 వరకు కూడా అధికా రంలో ఉంటుందని ఆయన విశ్వాసం



వ్యక్తం చేశారు.పార్టీ కార్యకర్తల్లో భ రోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 203 4 వరకు తానే సీఎంగా ఉంటానని చె ప్పారని, అందులో తప్పేమీ లేదని అ న్నారు.

➤ మిగతా 2వ పేజీలో..

మాతృశ్రీ కాలేజీ

దాండియా విషాదం

నిర్లక్ష్యం వహించిన ముగ్గురి అరెస్ట్

- ఈవెంట్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారణ
- ప్రమాదంలో విద్యార్థిని సోనా నారాయణదాస్ మృతి, 22 మందికి గాయాలు



➤ మిగతా 2వ పేజీలో..

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

రంగారెడ్డి జిల్లా నాదర్‌గూల్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల లో దాండియా వేడుకల సందర్భ ంగా చోటుచేసుకున్న ఘోర ప్రమా దానికి సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈవెం ట్ నిర్వహణలో అజాగ్రత్త, నిర్లక్ష్య ం వహించారనే ఆరోపణలపై సా కేత్, పునీత్, నిశాంతి యాదవ్‌ల ను ఆదిభట్ల పోలీసులు అదుపులో కి తీసుకుని రిమాండ్‌కు తరలిం చారు.వివరాల్లోకి వెళ్తే.. దసరా పండుగ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు ఉత్సాహంగా దాండియా ఆడుత ుండగా ఈ విషాదం చోటు చేసుకుంది.

సూర్యాపేటలో పేలుడు కలకలం

- సూర్యాపేటలోని శ్రీసాయి సూపర్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు
- గ్యాస్ లీక్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా

సూర్యాపేట,((సామాన్యుడి అస్త్రం)



➤ మిగతా 2వ పేజీలో..

సూర్యాపేట పట్టణంలో దసరా పండుగ వేళ భా రీ పేలుడు సంభవించింది. స్థానిక పీఎస్ఎస్ఆర్ సెంటర్ సమీపంలోని శ్రీసాయి సూపర్ మార్కె ట్‌లో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలింది. ప్ర మాద ధాటికి సూపర్ మార్కెట్ భవనం తీవ్రంగా ధ్వంసమై ంది.గ్యాస్ లీకేజీ కారణంగానే సిలిండర్ పేలి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తు న్నారు.

రఘురామ ఒక పోరాట

యోధుడు

ప్రశంసలు కురిపించిన బండ్ల గణేశ్



హైదరాబాద్, ((సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజుపై సినీ నిర్మాత బండ్ల గణేశ్ ప్రశ ంసలు కురిపించారు. గత ప్రభుత్వ హయాంలో తాను ఎదుర్కొన్న కష్టాలను రఘురామ ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో వివరించగా, ఆ వీడియోపై స్పం దిస్తూ గణేశ్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వై రల్‌గా మారింది.

ఎన్నికల కోడ్

తిరుమలలో తాత్కాలికంగా సిఫార్సు లేఖలు నిలిపివేత



తిరుమల(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై న నేపథ్యంలో తిరుమల తిరు పతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో ఉ న్నందున, శ్రీవారి దర్శనం, వసతి సౌకర్యాల కోసం ఇ చ్చే వీఐపీ సిఫార్సు లేఖలను తాత్కాలికంగాని లిపివేస్తున్నట్లు ప్రకటిం చింది.

తెలంగాణలో మద్యం

అమ్మకాల జోరు..

- గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి
- బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల

19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విక్రయాలు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకంగా కనిపించింది.ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (తో పోలిస్తే బీర్ల విక్రయాలు వేగంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇక ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా, ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగాయి.



క్రిమినల్స్‌తో ఫ్రెండ్లీగా ఉండొద్దు: సీఎం

మొదటి పేజి తరువాయి

పోలీసుల ప్రవర్తనే వారిపై ప్రజలకు నమ్మకాన్ని పెంచగలదని, పోలీసులు ఎట్టి పరిస్థితుల్లో చట్ట పరిధిని దాటి పని చేయవద్దని సూచించారు. పోలీసులకు క్రమశిక్షణే బలమని, నిజాయితీయేగౌరవమని, ప్రజల్లో కలిగిన భరోసా భావనే పోలీసులకు లభించే గొప్ప గుర్తింపు అని సీఎం అన్నారు. జవాబుదారీతనం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుళ్లకు కోటి రూపాయలు పరిహారం ఇస్తున్నామని ప్రస్తావించారు. అమరుల కుటుంబా ల పిల్లలకు వైద్య విద్యలో ప్రత్యేక సీట్లు కేటాయించామని, పోలీసు భద్రతా సంక్షేమ నిధి నుంచి రూ16 లక్షలు, పోలీసు సంక్షేమ నిధి నుంచి రూ.8 లక్షలు అందించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. పోలీసు శాఖలో 16 వేలకు పైగా ఖాళీలను గుర్తించగా, ఇప్పటికే ఐదు వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. వచ్చే ఏడాది చివరిలోపు మొత్తం ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. మంచిరేవులలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. హోంగార్డుల రోజువారీ వేతనం రూ.1,000కి పెంచామని చెప్పారు. నేర పరిశోధనలో ఏఐకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పోలీసు సమాచార వ్యవస్థ మొత్తాన్ని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అనుసంధానం చేశామని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదకంగా మారిన ఆహార కల్తీని అరికట్టడానికి టీజీ సేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాకుండా దానిని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఆహార కల్తీకి పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలేది లేద న్నారు. మహిళా భద్రతా కోణంలో స్టాండ్ విత్ హర్ అనే ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, మహిళలు, చిన్నారులకు



తక్షణ రక్షణ అందించేందుకు స్పందన బృందాలు సిద్ధం చేశామని వివరించారు. చిన్నారుల కేసుల్లో సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యా యం అందించడంలో జాప్యం చేయవద్దని సీఎం పోలీసులకు సూచించారు. పోలీసు శాఖలో యువరక్తం ఇంకా రావాలని కోరారు. అంతకుముందు డీజీపీ ఆనంద్ మాట్లాడుతూ, నిజాయితీగా ప్రతి పోలీసు సేవ చేయడమే అమరులకు ఇచ్చే నివాళి అన్నారు. ప్రజల సమస్యలకు చట్టప్రకారం నిజాయితీతో పరిష్కారం చూపాలన్నారు

తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు..

మొదటి పేజి తరువాయి

30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు

అమ్మకాలు 18.38 లక్షల కేసులకు

పెరుగుదల

అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల విక్రయాలు

అక్టోబర్ 19న రాష్ట్రంలో ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకున్నాయి. అక్టోబర్ 16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ.1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ.2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన



గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

మొదటి పేజి తరువాయి

వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు.బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.



సూర్యాపేటలో పేలుడు కలకలం

మొదటి పేజి తరువాయి

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ప్రాణనష్టంపై ఇంకా స్పష్టత రాలేదని వెల్లడి

పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి భయాందోళనలతో పరుగులు తీశారు. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రమాదంలో తమకు భారీగా



ఆస్తి నష్టం వాటిల్లిందని సూపర్ మార్కెట్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో ఎవరికైనా గాయాలయ్యాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదని, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

ఢిల్లీలో ఈసీకి వ్యతిరేకంగా నిరసన...

మొదటి పేజి తరువాయి

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో జరగనున్న నిరసనలో ప్రముఖ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ పాల్గొననున్నారు. అక్టోబర్ 23న (శుక్రవారం) జరగనున్న ఈ ఆందోళన కార్యక్రమంలో నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్‌రాజ్, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేలతో కలిసి ఆయన వేదికను పంచుకోనున్నారు.'పీపుల్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్' కూటమి ఈ నిరసనను నిర్వహిస్తోంది. 'ప్రతి వీధిలో ఒక జంతర్ మంతర్' అనే నినాదంతో దేశవ్యాప్తంగా వికేంద్రీకృత నిరసనలకు నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికంగా ఆందోళనలు చేపట్టాలని ప్రజలను కోరుతున్నారు.ఎస్ఐఆర్‌పై పరకాల ప్రభాకర్ మొదటి నుంచి తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇది కేవలం ఓటర్ల జాబితాను శుభ్రపరిచే కార్యక్రమం కాదని, ఏకపక్షంగా, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓట్లను తొలగించడం ద్వారా భారత రాజకీయ సమాజాన్ని పునర్నిర్మించేందుకు జరుగుతున్న 'లోతైన ప్రాజెక్ట్' అని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను పూర్తిగా రద్దు చేయడమే కాకుండా, ఏకంగా ఎన్నికల సంఘాన్నే రద్దు చేయాలని ఆయన ఇటీవలి కాలంలో డిమాండ్ చేస్తున్నారు. గతంలో బెంగళూరులో జరిగిన ఇలాంటి నిరసనలో కూడా ఆయన పాల్గొన్నారు.

పులివెందులలో దాడుల పర్వం..

మొదటి పేజి తరువాయి



పులివెందులలో వైసీపీ నాయకుల ఆస్తులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని, దీని వెనుక అధికార కూటమి నేతల హస్తం ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, వైసీపీ నేతల ఆస్తులను ధ్వంసం చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.గత వారం రోజులుగా పులివెందులతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఈ దాడులు కొనసాగుతున్నాయని అవినాశ్ రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల క్రితం పులివెందులలో ఓ చికెన్ సెంటర్‌ను తగలబెట్టారని, ఈ ఘటనలో టీడీపీ నేతలు విజయ్ కుమార్ రెడ్డి, షమీర్‌ల ప్రమేయం స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అలాగే, కౌన్సిల్ అభ్యర్థి నిరంజన్ రెడ్డికి చెందిన చెక్ బుక్కులను కూడా కాల్చివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాడుల గురించి స్పష్టమైన సమాచారం ఉన్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఘటనల సమయంలో పోలీసులు అక్కడే ఉండి హింసను ప్రోత్సహిస్తున్నారనే అనుమానం కలుగుతోందని అన్నారు.

జగన్ కు షాక్..

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కడపలో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి కడప జిల్లాలోని కీలక మున్సిపాలిటీలను టీడీపీ నేతృత్వంలోని కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకుని రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ విజయాలతో జిల్లాపై టీడీపీ పట్టు సాధించినట్లయింది.తాజా పరిణామాల ప్రకారం... ప్రొద్దుటూరు, బద్వేల్, జమ్మలమడుగు, రాయచోటి, రాజంపేట, కమలాపురం మున్సిపల్ ఛైర్మన్ పీఠాలను టీడీపీ ఏకగ్రీవంగా దక్కించుకుంది. ముఖ్యంగా రాయచోటిలోని మొత్తం 44 వార్డులను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచుకోవడం విశేషం. మిత్రపక్షమైన బీజేపీకి ఎర్రగుంట్ల మున్సిపాలిటీని కేటాయించి కూటమి ఐక్యతను చాటుకుంది. అంతేకాకుండా, జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల మున్సిపాలిటీపై కూడా టీడీపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది.అయితే, ఈ ఏకగ్రీవాలపై వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అధికార కూటమి అక్రమాలు, దౌర్జన్యాలతో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుందని, కొన్నిచోట్ల నామినేషన్ పత్రాలను అక్రమంగా తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దాడులు, బెదిరింపులతో తమను ఎన్నికల నుంచి తప్పించలేరని ఆయన వ్యాఖ్యానించారు.

మాతృశ్రీ కాలేజీ దాండియా విషాదం



మొదటి పేజి తరువాయి

వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ పోల్ ఒక్కసారిగా విద్యార్థులపై కూలిపోయింది. ఈ ఘటనలో వనపర్తికి చెందిన బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని సోనా నారాయణదాస్ (18) తీవ్ర గాయాలతో మృతి చెందగా, మరో 22 మంది విద్యార్థులు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని కామినేని, ప్రత్యూష ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ప్రాథమిక విచారణలో భాగంగా, ఈవెంట్ కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు నిర్ధారించారు. కళాశాల యాజమాన్యం కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు.ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలియజేసిన ఆయన, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

ఎన్నికల కోడ్...



మొదటి పేజి తరువాయి

శ్రీవారి దర్శనం, వసతి కోసం సిఫార్సులను స్వీకరించబోమని వెల్లడి

వ్యక్తిగతంగా వచ్చే ప్రొటోకాల్ వీఐపీలకు యథావిధిగా సౌకర్యాలు

సామాన్య భక్తులకు దర్శన, వసతి స్లాట్లు పెరిగే అవకాశం

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఆంక్షలు కొనసాగింపు

ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జారీ చేసే సిఫార్సు లేఖలను ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల భక్తుల రద్దీని నియంత్రించడంతో పాటు పారదర్శకతను పాటించడం సాధ్యమవుతుందని అధికారులు వెల్లడించారు. అయితే, ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులు వ్యక్తిగతంగా తిరుమలకు వస్తే, వారికి నిబంధనల మేరకు దర్శనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, వారి పేరుతో ఇతరులు సిఫార్సు లేఖలు తీసుకువస్తే అనుమతించబోమని స్పష్టం చేసింది.సిఫార్సుల కోటాను నిలిపివేయడం వల్ల ఆ స్లాట్లు సామాన్య భక్తులకు అందుబాటులోకి వస్తాయని, తద్వారా వారికి త్వరితగతిన దర్శనం, వసతి లభించే అవకాశాలు మెరుగవుతాయని టీటీడీ వర్గాలు భావిస్తున్నాయి. భక్తులు ఈ మార్పును గమనించాలని, సిఫార్సు లేఖలతో తిరుమలకు వచ్చి ఇబ్బందులకు గురికావొద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయి, కోడ్ ముగిసే వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించింది.

రఘురామ ఒక పోరాట యోధుడు..

మొదటి పేజి తరువాయి



గత ప్రభుత్వంలో తన అరెస్ట్ అనుభవాలను పంచుకున్న రఘురామ


ప్రాణాలపై ఆశ వదులుకున్నా, ప్రస్తుత జీవితం బోనస్ అన్న రఘురామ

చంద్రబాబు, లోకేశ్ పోరాటంలో రఘురామ కూడా ఉన్నారన్న బండ్ల

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న బండ్ల గణేశ్ ట్వీట్

నటుడు రాజా రవీంద్ర నిర్వహించిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రఘురామకృష్ణరాజు పలు కీలక విషయాలను వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో తన పుట్టినరోజు నాడే తనను అరెస్టు చేశారని, ఆ సమయంలో తాను ప్రాణాలతో తిరిగి వస్తానని అనుకోలేదని ఆయన గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం తాను గడుపుతున్న జీవితం భగవంతుడిచ్చిన 'బోనస్' అని వ్యాఖ్యానించారు. అప్పట్లో వైఎస్ జగన్‌పై తాను ఒంటరి పోరాటం చేశానని చెప్పారు. నరసాపురం ఎంపీగా ఉన్నప్పటికీ, 2020 ఫిబ్రవరి నుండి 2024 జనవరి వరకు తిరుపతిలో జరిగిన ఒక కార్యక్రమం మినహా, తన సొంత నియోజకవర్గానికి వెళ్లలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసే అవకాశం రానందుకు తొలుత కొంత నిరాశ చెందినప్పటికీ, ఎమ్మెల్యేగా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు.రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలపై స్పందించిన బండ్ల గణేశ్.. గత ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రాణాలకు తెగించి పోరాడారని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం సాగించారని పేర్కొన్నారు. ఆ అలుపెరుగని పోరాటంలో రఘురామకృష్ణరాజు కూడా కీలక భాగస్వామి అని బండ్ల గణేశ్ తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

మంచిర్యాలలో మళ్ళీ రాజుకున్న విభేదాలు.. ఎమ్మెల్యే అనుచరుడిపై దాడి



ప్రేమ్ సాగర్ రావు వర్గీయుడు దుర్గప్రసాద్‌కు తీవ్ర గాయాలు
తల్లాపేట గ్రామంలో ఉద్రిక్తత, భారీగా పోలీసుల మోహరింపు
కొన్ని రోజుల క్రితం బతుకమ్మ వేడుకల్లోనూ ఇరువర్గాల మధ్య ఘర్షణ

హైదరాబాద్, అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

మంచిర్యాల జిల్లాలో రాజకీయ వర్గపోరు మరోసారి భగ్గుమంది. దండేపల్లి మండలం తల్లాపేట గ్రామంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అనుచరుడిపై ప్రత్యర్థి వర్గం దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే వర్గీయుడైన ఆకుల దుర్గప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.వివరాల్లోకి వెళితే, తల్లాపేటలో ఆకుల దుర్గప్రసాద్‌పై ప్రత్యర్థులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను హుటాహుటిన చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారీగా పోలీసు బలగాలను మోహరించారు.కాగా, అక్టోబర్ 18న బతుకమ్మ వేడుకల సందర్భంగా కూడా ఇదే గ్రామంలో ప్రేమ్ సాగర్ రావు వర్గానికి, ప్రత్యర్థి వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఆ వివాదం జరిగిన కొద్ది రోజులకే ఈ దాడి జరగడం గమనార్హం. పాత కక్షలే ఈ దాడికి కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి: సీపీ సజ్జనార్



హైదరాబాద్‌లో మూడు చోట్ల పోలీసుల దాడులు
నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన సీపీ సజ్జనార్
జీవకారుణ్యమే నిజమైన భక్తి అని ప్రజలకు పిలుపు
వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు.దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు."స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రూ.2000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం



హైదరాబాద్, అక్టోబరు 19

రాష్ట్ర ప్రభుత్వం రూ.2000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 7.53శాతం వార్షిక వడ్డీ, 13ఏళ్ల కాల పరిమితితో రూ.1000కోట్లు, 7.65శాతం వార్షిక వడ్డీ, 23 ఏళ్ల కాల పరిమితితో రూ.1000కోట్ల చొప్పున రుణాన్ని తీసుకుంది. దేశంలోని 11 రాష్ట్రాలు రూ.23,016 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

2028 నాటికి పోలీస్ శాఖలో ఖాళీలన్నీ భర్తీ చేస్తాం



కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐలకు రూ. కోటి
ఎస్ఐలు, ఇన్స్పెక్టర్లకు రూ. కోటి 25 లక్షలు
డీఎస్పీ, అదనపు ఎస్పీకి రూ. కోటి 50 లక్షలు
ఎస్పీ, ఐపీఎస్‌లకు రూ. 2 కోట్ల పరిహారం
హోంగార్డులకు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు
పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్21, (సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుంటేనే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే 2028 నాటికి పోలీసు శాఖలో ఖాళీలన్నీ భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితెలిపారు. ఇప్పటికే 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చామని, మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.పథకాలు చూడండివిధి నిర్వహణలో ప్రాణా లు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉం టుందని, ఆయా కుటుంబాలకు పరిహారాన్ని భారీగా పెంచినట్లు వెల్లడించారు. బు ధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషా మహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్థూపానికి డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి నివాళులర్పించారు. అమరవీరుల సేవలను స్మరిస్తూ రూపొందించిన 'అమరులు వారు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం భావోద్వేగంతో కూడిన రోజని, సమాజం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమన్నారు. అమరుల కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరని, వారి కుటుంబాలు ఒంటరివి కావని, తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

పరిహారం భారీగా పెంపు..

పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని సీఎం తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు వెల్లడించారు.కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్, ఏఎస్ఐల కుటుంబాలకు రూ.45 లక్షల నుంచి రూ. కోటి, ఎస్ఐలు, ఇన్స్‌పెక్టర్లకు రూ.45లక్షల నుంచి రూ. కోటి 25 లక్షలు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు రూ.50 లక్షల నుంచి రూ.కోటి 50 లక్షలు, ఎస్పీ, ఐపీఎస్ అధికారుల కుటుంబాలకు కోటి రూపాయల నుంచి రూ.2 కోట్లకు పరిహారం పెంచినట్లు తెలిపారు.ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని సీఎం స్పష్టం చేశారు. అలాగే హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ. 10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని, పోలీసు శాఖను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని, ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించడం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నం చేశామని సీఎం వెల్లడించారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

ఈగల్ సేవలు భేష్..

కాలంతో పాటు నేర స్వభావం మారుతోందని, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు శాఖను ఆధునీకరించాలని నిర్ణయించామని, అందులో భాగంగా ఆధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను తీసుకొచ్చామని వెల్లడించారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మరిన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని, మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ఎంత పెరిగినా పోలీసులు మానవీయ దృక్పథం మారకూడదన్నారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్: గ్రిడ్‌కు అనుసంధానమైన చివరి యూనిట్.. 4000 మెగావాట్ల లక్ష్యం పూర్తి



ఎల్ నినో ప్రభావంతో పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు ఊరట
ప్లాంట్ నిర్మాణంపై గత ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శలు
త్వరలో ఐదో యూనిట్‌లో వాణిజ్య

కార్యకలాపాలు ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ విద్యుత్ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదో యూనిట్‌ను బుధవారం విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానించారు. దీంతో 4,000 మెగావాట్ల మొత్తం సామర్థ్యంతో తలపెట్టిన ఈ భారీ ప్రాజెక్టులోని ఐదు యూనిట్ల ప్రక్రియ పూర్తయినట్లయింది.ఈ యూనిట్‌ను గ్రిడ్‌కు సింక్రనైజ్ చేసినట్లు తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎన్. హరీశ్ వెల్లడించారు. ఈ ఘనత సాధించినందుకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్), జెన్‌కో బృందాలను ఆయన అభినందించారు. వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన తదుపరి పరీక్షల నిమిత్తం, సింక్రనైజ్ చేసిన వెంటనే యూనిట్‌ను హ్యాండ్-ట్రిప్ చేశారు. త్వరలోనే ఈ యూనిట్‌లో పూర్తిస్థాయి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుంది.ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. సాధారణంగా అక్టోబర్‌లో 15,000 మెగావాట్లుగా ఉండే డిమాండ్, ప్రస్తుతం వ్యవసాయ పంపుసెట్లు, పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా 20,003 మెగావాట్లకు చేరింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఐదో యూనిట్ అందుబాటులోకి రావడం జెన్‌కోకు పెద్ద ఊరటనిస్తోంది.కాగా, బొగ్గు గనులకు దూరంగా ఈ ప్లాంట్‌ను నిర్మించడంపై డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. దీనివల్ల బొగ్గు రవాణాకే అదనంగా రూ. 40,000 కోట్ల భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల మార్గనిర్దేశంలోనే ఈ విజయం సాధ్యమైందని అధికారులు తెలిపారు.

విజయవాడలో భారీగా బంగారం, విదేశీ కరెన్సీ పట్టివేత

రూ.5.84 కోట్ల విలువైన స్మగ్లింగ్ సొత్తు స్వాధీనం
డీఆర్ఐ ఆపరేషన్‌లో ఐదుగురు సభ్యుల ముఠా అరెస్ట్
బంగ్లాదేశ్ నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా గుట్టురట్టు
స్కార్పియో, బస్సుల్లో చాకచక్యంగా పట్టుకున్న అధికారులు

హైదరాబాద్, అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

అక్రమంగా తరలిస్తున్న బంగారం, విదేశీ కరెన్సీని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ కేంద్రంగా నిర్వహించిన ఈ మెరుపు దాడిలో సుమారు రూ.5.84 కోట్ల విలువైన స్మగ్లింగ్ సొత్తును పట్టుకోవడంతో పాటు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతా మీదుగా హైదరాబాద్‌కు ఈ ముఠా అక్రమ రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.డీఆర్ఐ హైదరాబాద్, విజయవాడ యూనిట్ల అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజయవాడ శివారులో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒక స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య అరలో 60,000 అమెరికన్ డాలర్లు, 21,500 యూరోలను గుర్తించారు. వాహనంలోని వ్యక్తులను విచారించగా వెల్లడైన సమాచారం ఆధారంగా, సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఒక ప్రైవేట్ బస్సును అడ్డగించారు.సదరు బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా, వారి నడుముకు కట్టుకున్న పౌచ్‌లలో 3,147.1 గ్రాముల బరువున్న మూడు బంగారు కడ్డీలు లభ్యమయ్యాయి. పట్టుబడిన బంగారం, విదేశీ కరెన్సీ మొత్తం విలువ సుమారు రూ.5.84 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.ఈ స్మగ్లింగ్ వ్యవహారంతో ప్రమేయం ఉన్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ ముఠాకు అంతర్జాతీయ స్మగ్లర్లతో ఉన్న సంబంధాలపై డీఆర్ఐ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు



స్థానిక ఎన్నికలకు చంద్రబాబు

కొత్త నినాదం!

స్థానిక ఎన్నికలపై టీడీపీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
'చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపు
రెబల్స్‌గా నామినేషన్లు వేస్తే సస్పెన్షన్ తప్పదని కఠిన హెచ్చరిక
కూటమి పార్టీలతో సమన్వయంతో పనిచేసి మిత్రధర్మాన్ని పాటించాలని సూచన
టికెట్ రాని నేతలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ



అమరావతి,అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. నేడు పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీలతో సమన్వయంపై కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే రెబెల్స్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు.సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, అదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల ఆశీర్వాదం పొందాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని గుర్తుచేశారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమగ్రంగా వివరించాలని ఆయన నేతలకు పిలుపునిచ్చారు.కూటమిలోని జనసేన, బీజేపీ పార్టీలతో పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు ప్రక్రియను సాఫీగా, సామరస్యపూర్వకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిత్రధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, జనసేన, బీజేపీలకు కేటాయించిన స్థానాల్లో కూడా రెబెల్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కిచెప్పారు.టికెట్లు ఆశించి భంగపడిన నేతలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల ద్వారా న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి రెబెల్స్‌గా నామినేషన్లు వేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారు వెంటనే తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. ప్రజలకు సేవ చేసే మంచి అభ్యర్థులను ఎంపిక చేయాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

బెంగళూరు నుంచే జగన్ డైరెక్షన్..

రాష్ట్రంలో గొడవలకు వైసీపీ కుట్ర



కూటమి ప్రభుత్వంలో రౌడీయిజాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదన్న టీడీపీ నేత
శాంతియుతంగా స్థానిక ఎన్నికలు.. వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని వెల్లడి
పోలీసు అధికారిపై రోజా దాడి చేయడం దారుణమన్న ఎస్వీఎస్ఎన్ వర్మ
బీసీ రిజర్వేషన్లను సైతం జగన్ అడ్డుకుంటున్నారని ఆరోపణ

అమరావతి,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచే రాష్ట్రంలో గొడవలకు సూచనలు ఇస్తున్నారని, ఆయన ఆదేశాలతోనే కింది స్థాయి నాయకులు అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ నేత ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రౌడీయిజాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అత్యంత శాంతియుతంగా, పారదర్శకంగా జరుగుతున్నా.. శాంతిభద్రతలు లోపించాయనే తప్పుడు ప్రచారానికి వైసీపీ తెరలేపిందని విమర్శించారు.రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని వర్మ అన్నారు. "గతంలో తమ పాలనలో నామినేషన్లు వేయకుండా బెదిరించడం, ఇళ్లలో గంజాయి ప్యాకెట్లు పెట్టి తప్పుడు కేసులు బనాయించడం వంటివి చేసిన చరిత్ర వైసీపీది. కానీ, మా ప్రభుత్వంలో అలాంటి బెదిరింపులకు తావులేదు. ప్రజాస్వామ్య విలువలపై టీడీపీకి ఉన్న నమ్మకానికి మాచర్ల నియోజకవర్గమే నిదర్శనం. గతంలో అదే మాచర్లలో టీడీపీ నేతలు బొండా ఉమా, బుద్ధా వెంకన్నలపై దాడులు జరిగాయి. కానీ, నేడు అదే ప్రాంతంలో వైసీపీ నేతలు ఎలాంటి ఇబ్బంది లేకుండా 36 నామినేషన్లు శాంతియుతంగా వేశారు. ఇదే మా సంస్కృతి" అని వర్మ వివరించారు.నగరిలో మాజీ మంత్రి రోజా తీరుపై వర్మ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల అధికారి కార్యాలయం వద్ద ఓ పోలీసు అధికారిపై దాడి చేసి, గుండెలపై చేయి వేసి నెట్టడం రౌడీయిజం కాదా అని ప్రశ్నించారు. "ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు ముగ్గురు, నలుగురు మాత్రమే లోపలికి వెళ్లాలి. కానీ, నిబంధనలు ఉల్లంఘించి దౌర్జన్యంగా ప్రవర్తించారు. మహిళా నాయకులే ఇలా ఉంటే మిగతా వారి పరిస్థితి ఏంటి?" అని ఆయన నిలదీశారు. అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారమే పనిచేస్తున్నారని, వారి విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.చంద్రబాబు నాయుడు గ్రామ స్థాయి నుంచి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని నమ్ముతారని, బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటే.. జగన్ కోర్టుల ద్వారా దానిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వర్మ ఆరోపించారు. 'చెప్పింది చేస్తాం' అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజల సంపూర్ణ మద్దతు తమకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో పోలీసు వ్యవస్థ బలంగా పనిచేస్తోందని, వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా స్థానిక ఎన్నికలు ప్రశాంతంగానే ముగుస్తాయని ఆయన పునరుద్ఘాటించారు.

తిరుమలలో సాధారణ రద్దీ.. సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమలలో సాధారణ స్థాయిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 9 కంపార్ట్‌మెంట్లలో భక్తులు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న 83,745 మంది
ఒక్కరోజే రూ. 2.99 కోట్లుగా హుండీ ఆదాయం



అమరావతి,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. టైమ్ స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం నాటికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 9 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు.క్యూలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వారికి నిరంతరాయంగా పాలు, తాగునీరు, అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. రద్దీ సాధారణంగానే ఉన్నందున భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకుంటున్నారని టీటీడీ వర్గాలు వెల్లడించాయి.మంగళవారం నాడు మొత్తం 83,745 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరిలో 19,391 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ద్వారా రూ. 2.99 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ పేర్కొంది.

ఏపీ మున్సిపల్ ఎన్నికలు: ఎస్ఈసీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు, అభ్యర్థుల జాబితా వాయిదా



వైసీపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ
నామినేషన్ల గడువు పెంపునకు నిరాకరణ
ఫిర్యాదులున్న 19 చోట్ల పరిశీలించాలని ఎస్ఈసీకి ఆదేశం

అమరావతి,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించేందుకు నిరాకరించిన ధర్మాసనం, వైసీపీ ఫిర్యాదు చేసిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రం పరిశీలన జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించింది. దీంతో పాటు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా వేసిందితమ అభ్యర్థులను 19 చోట్ల నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, హింసకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని, ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతుంటే రాజ్యాంగ కోర్టులు మౌనంగా ఉండలేవని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాటిని పరిశీలించి, నామినేషన్ల స్వీకరణకు అవకాశం కల్పించాలా వద్దా అనే దానిపై రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని సూచించింది.ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయంపైనే కేంద్రీకృతమైంది.

విజయనగరం కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ తేదీ మార్పు



అక్టోబర్ 28కి బదులుగా 29న పోలింగ్ నిర్వహణ
పైడితల్లి సిరిమాను ఉత్సవం కారణంగా ఎస్ఈసీ నిర్ణయం
అక్టోబర్ 30న యథాతథంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

అమరావతి,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

విజయనగరం నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ తేదీలో మార్పు జరిగింది. ముందుగా ప్రకటించినట్లు అక్టోబర్ 28న కాకుండా, అక్టోబర్ 29న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) స్పష్టం చేసింది. ప్రసిద్ధ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.విజయనగరంలో అక్టోబర్ 27న సిరిమాను ఉత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి సుమారు 4 నుంచి 5 లక్షల మంది భక్తులు హాజరవుతారని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో భద్రతా సిబ్బంది కేటాయింపు, ట్రాఫిక్ నియంత్రణ వంటి పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని, అందువల్ల పోలింగ్ తేదీని మార్చాలని జిల్లా కలెక్టర్ ఎస్ఈసీకి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన ఎస్ఈసీ, పోలింగ్‌ను ఒక రోజు వాయిదా వేసింది.కొత్త షెడ్యూల్ ప్రకారం, అక్టోబర్ 29న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు మాత్రం ముందుగా ప్రకటించినట్లే అక్టోబర్ 30న ఉదయం 8 గంటల నుంచి యథాతథంగా కొనసాగుతుంది. ఒకవేళ ఎక్కడైనా రీ-పోలింగ్ అవసరమైతే, దానిని అక్టోబర్ 30న నిర్వహిస్తారు. రీ-పోలింగ్ పూర్తయ్యే వరకు తుది ఫలితాలు ప్రకటించవద్దని జిల్లా అధికారులకు ఎస్ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఇక ఎన్నికల ప్రచార గడువులో ఎలాంటి మార్పు లేదు. ఇతర పట్టణ స్థానిక సంస్థలతో పాటే విజయనగరంలోనూ అక్టోబర్ 26 సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడనుంది

ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

అమరావతి,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో 19 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నిలిచిపోయాయి.రాష్ట్రంలో అధికార పక్షం వేధింపుల కారణంగా పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, వారిని అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని, గడువు పొడిగించి తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ మౌలిక సూత్రమని స్పష్టం చేసింది.

దేవరగట్టు బన్నీ ఉత్సవంలో అపశ్రుతి..

కర్రల సమరంలో ఒకరి మృతి

దేవరగట్టు కర్రల సమరంలో మరోసారి తీవ్ర హింస

బన్నీ ఉత్సవంలో జరిగిన ఘర్షణలో 100 మందికి పైగా గాయాలు

సంప్రదాయం పేరిట ప్రాణాలు కోల్పోతున్నా ఆగని ఉత్సవం

హింసను నివారించడంలో విఫలమవుతున్న అధికారులు, పోలీసులు

ఏపీ, కర్ణాటక, తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు



అమరావతి,అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

కర్నూలు జిల్లా దేవరగట్టులో ఏటా జరిగే కర్రల సమరంలో మరోసారి రక్తం చిందింది. దసరా పండుగ మరుసటి రోజు రాత్రి నిర్వహించిన బన్నీ ఉత్సవంలో తీవ్ర హింస చెలరేగింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయం పేరిట జరుగుతున్న ఈ ఉత్సవం మరోసారి విషాదాన్ని మిగిల్చింది.వవరాల్లోకి వెవెళితే.. హోళగుంద మండలం దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను కొండపై నుంచి కిందకు తీసుకొస్తుండగా ఈ ఘర్షణ చోటుచేసుకుంది. స్వామివారి విగ్రహాలను దక్కించుకునేందుకు 11 గ్రామాల ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి కర్రలు, దివిటీలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ భీకర సమరంలో తలలు పగిలి, తీవ్ర రక్తస్రావమైనా ఎవరూ వెనక్కి తగ్గలేదు. ఈ ఘర్షణలో ఆలూరుకు చెందిన పోతురాజు అనే వ్యక్తి మృతి చెందాడు. గాయపడిన వందలాది మందిని హుటాహుటిన ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ప్రతి ఏటా విజయదశమి మరుసటి రోజు అర్ధరాత్రి దేవరగట్టులో ఈ బన్నీ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. మాళమ్మ, మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను దక్కించుకోవడమే ఈ సమరం వెనుక ఉన్న సంప్రదాయం. ఈ ఉత్సవం కోసం ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివస్తారు.ఈ ఉత్సవంలో హింసకు తావులేకుండా చూడాలని పోలీసులు, జిల్లా అధికారులు ఏటా పెద్ద ఎత్తున అవగాహన కల్పించి, భారీ బందోబస్తు ఏర్పాటు చేసినా ఫలితం ఉండటం లేదు. భక్తుల రూపంలో కర్రలను ఆలయ పరిసరాలకు తరలించి, అర్ధరాత్రి సమయానికి దాడులకు దిగుతున్నారు. సంప్రదాయం పేరిట ఏటా జరుగుతున్న ఈ రక్తపాతాన్ని నివారించడం అధికారులకు సవాలుగా మారింది. ప్రాణాలు పోతున్నా ఈ ఆచారాన్ని కొనసాగించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

స్థానిక ఎన్నికల వాయిదా..
ఈసీ నిర్ణయాన్ని గౌరవిస్తామన్న అధికార కూటమి



ఈసీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ

వైసీపీ కుట్రల వల్లే ఎన్నికలు ఆగిపోయాయని ఆరోపణ

ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ 59 పిటిషన్లు వేసిందన్న కూటమి

పారదర్శకంగా ఎన్నికలు జరగాలన్నదే తమ లక్ష్యమని వెల్లడి

అమరావతి,అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని అధికార కూటమి పార్టీలు ప్రకటించాయి. ఈసీ ఏ నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తామని స్పష్టం చేశాయి.ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్లతో బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదలైంది. కుట్రల ద్వారా ఎన్నికలను అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ పనిచేస్తోందని ఈ ప్రకటనలో కూటమి పార్టీలు తీవ్రంగా ఆరోపించాయి. రాష్ట్రానికి కేంద్ర నిధులు సకాలంలో అందాలన్నా, అభివృద్ధి పనులు ముందుకు సాగాలన్నా ఎన్నికలు గడువులోగా పూర్తి చేయాలని తాము భావించినట్లు తెలిపాయి.ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై వైసీపీకి ఏమాత్రం బాధ్యత లేదని, మొదటి నుంచీ స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకే ప్రయత్నిస్తోందని విమర్శించాయి. ఎన్నికలను నిలిపివేయడం కోసం వైసీపీ ఏకంగా 59 పిటిషన్లను కోర్టులలో దాఖలు చేసిందని, ఆ అడ్డంకులు తొలగి ఎన్నికల ప్రక్రియ మొదలయ్యే సమయంలో హింసను ప్రేరేపించిందని ఆరోపించాయి.ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో, నిజాయతీగా జరగాలన్నదే తమ లక్ష్యమని, ఈ ప్రక్రియకు పూర్తి మద్దతు ఇస్తామని కూటమి పునరుద్ఘాటించింది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరిగి, సమర్థులైన నాయకులు ఎన్నికై, కూటమి ప్రభుత్వ ఫలాలు ప్రతి ఇంటికీ అందాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.


నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

నిత్యవసరాల ధరల పెరుగుదలను నియంత్రించాలని సీఎం ఆదేశం

ఎల్ నినో ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచన

పీఎం సూర్యఘర్ కనెక్షన్ల ఏర్పాటును వేగవంతం చేయాలన్న చంద్రబాబు

ఇసుక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం



అమరావతి,అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై భారం పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని, దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అమ్మకాలపై ఆయన ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా.. దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో కూడా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని, దీన్ని మరింత మెరుగుపరచాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీని కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.ఇసుక సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం సూచించారు. పాలనలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంగళగిరిలో వైసీపీకి షాక్..
లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన కీలక నేత



మంగళగిరిలో టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

మంత్రి లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత రజనీకాంత్

స్థానిక ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలవాలని పిలుపు

మంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న లోకేశ్

రజనీకాంత్‌తో పాటు టీడీపీ తీర్థం పుచ్చుకున్న 25 కుటుంబాలు

అమరావతి,అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

మంగళగిరి నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, గుంటూరు పార్లమెంట్ వైసీపీ ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ తన మద్దతుదారులతో కలిసి టీడీపీలో చేరారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు, మరో 25 కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. “2024 సార్వత్రిక ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లోనే ఎక్కువ మెజార్టీ సాధించాలి. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఎన్డీయే పక్షాన నిలబడటమే మనకు శ్రీరామరక్ష. అప్పుడే మనం అనుకున్న అభివృద్ధి సాధ్యమవుతుంది” అని ఆయన స్పష్టం చేశారు.గత పదేళ్ల పాలనను, తన రెండున్నరేళ్ల పనితీరును బేరీజు వేసుకుని ప్రజలుఓటు వేయాలని లోకేశ్ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, ఆసుపత్రి, కమ్యూనిటీ భవనాలు, పార్కులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అహర్నిశలు పనిచేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎంపీపీ అయిన రజనీకాంత్‌తో పాటు, చిలువూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ యాళ్ల జయలక్ష్మి, ఇతర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్: చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు

పిటిషన్లతో ఎన్నికలు, అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని ఆరోపణ

జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలని నేతలకు సూచన

క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు

అమరావతి,అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, బూత్ స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో జగన్ లాంటి ‘క్రిమినల్ లిటిగెంట్లు’ ఉండటం అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.తానే విధ్వంసానికి పాల్పడి, తానే కోర్టుకు వెళ్లే వికృత ఆలోచనలు జగన్‌కే వస్తాయని చంద్రబాబు అన్నారు. వైసీపీని ‘గొడ్డలి పార్టీ’గా అభివర్ణిస్తూ, అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. కేవలం స్థానిక ఎన్నికలనే కాకుండా, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వందల సంఖ్యలో పిటిషన్లు వేశారని ఆరోపించారు. ఓటరు జాబితా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లి ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారని గుర్తుచేశారు.స్థానిక ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాము మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తుంటే, వైసీపీ మాత్రం విధ్వంసకారులను బరిలోకి దించుతోందని ఆరోపించారు.

సైనిక పెత్తనం భరించలేక.. విదేశాల వైపు చూస్తున్న పాక్ అధికారులు.. స్వయంగా వెల్లడించిన రక్షణ మంత్రి!



పాక్ అధికారుల విదేశీ వలసలపై ఖవాజా ఆసిఫ్ ఆరోపణలు
ఉద్యోగంలో ఉండగానే విదేశాల్లో స్థిరపడేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని వెల్లడి
కెనడా, అమెరికా, బ్రిటన్ అధికారుల గమ్యస్థానాలుగా ప్రస్తావన
పోర్చుగల్ కూడా ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందని వ్యాఖ్య
శాశ్వత నివాసం పేరుతో డబ్బు వసూలు చేసి వ్యక్తి పరారయ్యాడని ఆరోపణ

న్యూఢిల్లీ,అక్టోబర్21,((సామాన్యుడి అస్త్రం)

పాకిస్థాన్‌లో ఉన్నతాధికారుల విదేశీ వలసల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంలో కీలక పదవులు చేపట్టిన కొందరు అధికారులు ఉద్యోగంలో ఉండగానే విదేశాల్లో స్థిరపడేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆరోపించారు. కెనడా, అమెరికా, బ్రిటన్‌తో పాటు యూరప్‌లోని పలు దేశాలకు వెళ్లి స్థిరపడిన అధికారుల వ్యవహారంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ ప్రభుత్వ అధికారుల్లో పలువురు విదేశాల్లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పోర్చుగల్ కూడా వారి గమ్యస్థానాల్లో ఒకటిగా మారిందని పేర్కొన్నారు.ఉద్యోగంలో కొనసాగుతూనే విదేశాల్లో స్థిరపడేందుకు పథకం ప్రకారం ఏర్పాట్లు చేసుకున్నారని ఆసిఫ్ ఆరోపించారు. దేశానికి సేవ చేయాల్సిన సమయంలోనే ఇలా వ్యవహరించడం వారి నిబద్ధతపై అనుమానాలు కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో పేర్లు వినిపించిన అధికారులు గత ప్రభుత్వాల్లోనూ కీలక పదవులు చేపట్టారని, రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని పేర్కొన్నారు.


శాశ్వత నివాసం పేరుతో డబ్బు వసూలు?

విదేశాల్లో శాశ్వత నివాస అనుమతులు ఇప్పిస్తానని చెప్పిన ఓ వ్యక్తి అధికారుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేసి పారిపోయినట్లు ఆసిఫ్ ఆరోపించారు. అయితే ఆ వ్యక్తి పేరు వెల్లడించలేదు. తన ఆరోపణలకు ఆధారాలను కూడా బయటపెట్టలేదు.

సైన్యం ప్రభావంపై చర్చ

పాకిస్థాన్‌లో పౌర ప్రభుత్వం, సైన్యం మధ్య అధికార సమతుల్యతపై ఈ వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి పాకిస్థాన్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ మద్దతు కీలకంగా ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మునీర్‌కు పెరిగిన సాన్నిహిత్యం ఆయన దేశీయ రాజకీయ ప్రభావాన్ని మరింత పెంచిందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి.

అమెరికాలో నిత్యం జరుగుతాయి: భారత్‌లో నిరసనలపై మార్కో రూబియో



భారత్‌లో నిరసనలపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందన
ప్రజాస్వామ్యంలో నిరసనలు సహజమని, అమెరికాలోనూ రోజూ జరుగుతాయని వ్యాఖ్య
దేశ అంతర్గత విషయాల్లో తాను జోక్యం చేసుకోబోనని స్పష్టీకరణ
రిఫైనింగ్ సూపర్‌పవర్‌గా భారత్‌ను కొనియాడిన రూబియో

న్యూఢిల్లీ,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

భారత్‌లో జరుగుతున్న నిరసనలపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు, రాజకీయ విభేదాలు సర్వసాధారణమని, ఇలాంటివి తమ దేశంలోనూ నిత్యం జరుగుతుంటాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో జరుగుతున్న నిరసనల గురించి విలేకరులు ప్రశ్నించగా ఆయన పైవిధంగా స్పందించారు.భారత్‌లో నిరసనలను అణచివేసేందుకు ప్రభుత్వం మితిమీరిన బలప్రయోగం చేస్తోందంటూ ఐక్యరాజ్యసమితి నిపుణులు ఇటీవల చేసిన విమర్శలపైనా రూబియో అభిప్రాయం కోరారు. దీనిపై ఆయన బదులిస్తూ, “ఒక దేశ అంతర్గత అంశాల్లో నేను జోక్యం చేసుకోను. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ. ప్రజలు బయటకు వచ్చి నిరసనలు చేస్తున్నారంటే, అక్కడ రాజకీయ చర్చలు, అభిప్రాయ భేదాలు ఉన్నాయని అర్థం. ఇది ఆరోగ్యకరమైన సంకేతమే,” అని వివరించారు.ప్రస్తుతం మూడు రోజుల భారత పర్యటనలో ఉన్న మార్కో రూబియో.. గుజరాత్‌లోని జామ్‌నగర్‌ను సందర్శించనున్నారు. అక్కడ ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన చమురు శుద్ధి కర్మాగారాన్ని పరిశీలిస్తారు. ఈ సందర్భంగా ఆయన భారత్‌ను “రిఫైనింగ్ సూపర్‌పవర్”గా అభివర్ణించారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో, వెనెజువెలా చమురుకు అమెరికా కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్న తరుణంలో రూబియో పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

డ్రోన్ల ఆట కట్టించేందుకు ఆర్మీకి కొత్త రాడార్లు..


భారత సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యం పెంపే లక్ష్యం
చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి ట్రాక్ చేయగల రాడార్లు
గగనతల లక్ష్యాలకు ప్రాధాన్యాన్ని నిర్ణయించే సాంకేతికత
2025-26లో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.78 లక్షల కోట్ల
రక్షణ ఎగుమతులు రూ.38,424 కోట్లకు పెరుగుదల



న్యూఢిల్లీ,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

సరిహద్దుల్లో డ్రోన్ల ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యానికి కొత్త రాడార్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం రక్షణ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో రూ.770 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంప్రూవ్డ్ లో-లెవల్ లైట్‌వెయిట్ రాడార్ (ఐూూ=-×) వ్యవస్థలను సమకూర్చుకోవడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఈ రాడార్లు సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యాన్ని పెంచనున్నాయి.ఈ రాడార్లతో యుద్ధ విమానాల పరిమాణంలో ఉండే లక్ష్యాలతో పాటు చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను పర్యవేక్షించవచ్చు. గగనతలంలో గుర్తించిన లక్ష్యాల్లో ఏవి ఎక్కువ ప్రాధాన్యంతో ఎదుర్కోవాలో నిర్ణయించేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. దీంతో మానవరహిత వైమానిక వ్యవస్థల (యూఏఎస్) నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కోవడంలో సైన్యానికి సహాయం అందనుంది. రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీని పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కొనుగోలు చేపట్టినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల దేశీయ రక్షణ పరిశ్రమతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) కూడా అవకాశాలు పెరిగే వీలుంది.గత దశాబ్దంలో భారత్ రక్షణ ఉత్పత్తుల తయారీలో గణనీయమైన వృద్ధిని సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం.. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.4,746 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ 2025-26లో రూ.1.78 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో రక్షణ ఎగుమతులు రూ.686 కోట్ల నుంచి రూ.38,424 కోట్లకు పెరిగాయి. భారత రక్షణ పరికరాలు ప్రస్తుతం 80కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.2029 నాటికి ఏటా రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తుల తయారీ, రూ.50 వేల కోట్ల ఎగుమతులు సాధించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధికి కేటాయింపులను కూడా పెంచింది. 2026-27లో ఈ కేటాయింపులు రూ.29,100.25 కోట్లకు చేరాయి. పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు కొత్త రక్షణ సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు పరిశోధన బడ్జెట్‌లో 25 శాతాన్ని అందుబాటులో ఉంచింది.

తక్కువ ఛార్జీకే రాపిడో ఎక్కాడని.. ప్రయాణికుడిపై ఆటో డ్రైవర్ దాడికి ప్రయత్నం



బెంగళూరులో రాపిడో బైక్ ఎక్కిన ప్రయాణికుడికి చేదు అనుభవం
తక్కువ ఛార్జీ అని బైక్ ట్యాక్సీ ఎక్కడంతో వెంబడించిన ఆటో డ్రైవర్
కదులుతున్న బైక్‌పై నుంచి చేయి పట్టుకుని లాగేందుకు యత్నించాడని ఆరోపణ
ఘటనపై సోషల్ మీడియాలో నెటిజన్ల ఆగ్రహం, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచన

న్యూఢిల్లీ,అక్టోబర్21(సామాన్యుడి అస్త్రం)

టెక్ రాజధాని బెంగళూరులో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. ఆటో కాదని తక్కువ ఛార్జీకే లభించే రాపిడో బైక్ ట్యాక్సీ ఎక్కినందుకు ఓ ఆటో డ్రైవర్ ప్రయాణికుడిపై దాడికి యత్నించాడు. కదులుతున్న బైక్‌ను వెంబడించి వెనుక కూర్చున్న ప్రయాణికుడిని చేయి పట్టుకుని కిందకు లాగేందుకు ప్రయత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితుడు ఈ భయానక అనుభవాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడ్డిట్'లో పంచుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళితే.. బెంగళూరులో ఓ ప్రయాణికుడు సుమారు 2-3 కిలోమీటర్ల స్వల్ప దూరానికి ఆటో కోసం ప్రయత్నించాడు. అయితే పలువురు ఆటో డ్రైవర్లు రూ.120 డిమాండ్ చేయడంతో, అధిక ఛార్జీ చెల్లించడం ఇష్టం లేక రాపిడో బైక్ ట్యాక్సీని బుక్ చేసుకున్నాడు. అతను బైక్ ఎక్కిన కొద్దిసేపటికే ఈ అనూహ్య ఘటన జరిగింది.”నేను బైక్ ఎక్కగానే ఓ ఆటో డ్రైవర్ మా బైక్‌ను వెంబడించడం మొదలుపెట్టాడు. కదులుతున్న బైక్‌పై నుంచే నా చేయి పట్టుకుని కిందకు లాగేందుకు ప్రయత్నించాడు. ఒకవేళ అతను నన్ను లాగగలిగి ఉంటే, నేను తీవ్రంగా గాయపడి ఉండేవాడిని” అని బాధితుడు తన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చాలాకాలంగా బెంగళూరులోనే నివసిస్తున్నానని, కానీ ఇలాంటి భయానక అనుభవం ఎప్పుడూ ఎదురుకాలేదని పేర్కొన్నాడు. బైక్ ట్యాక్సీల వల్ల తమకు ఎదురవుతున్న సమస్యలపై ఆటో డ్రైవర్లకు ఆందోళన ఉండొచ్చు. కానీ ప్రయాణికులపై భౌతికంగా దాడికి యత్నించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అతను అభిప్రాయపడ్డాడు.ఈ ఘటనపై ఏం చేయాలో సలహా కోరుతూ అతను పెట్టిన పోస్ట్‌కు నెటిజన్ల నుంచి భారీ స్పందన వచ్చింది. చాలా మంది వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఆటో రిజిస్ట్రేషన్ నంబర్‌ను అధికారులకు అందించాలని సూచించారు. “ఇది హత్యాయత్నంతో సమానం. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. ట్రాఫిక్ కెమెరా ఫుటేజీ ఆధారంగా డ్రైవర్‌ను గుర్తించవచ్చు” అని ఒకరు కామెంట్ చేశారు. మరో యూజర్ తన అనుభవాన్ని పంచుకుంటూ.. ఆటో డ్రైవర్ల వేధింపుల నుంచి తప్పించుకోవడానికి రాపిడో డ్రైవర్ తనను స్నేహితుడిగా చెప్పమని కోరినట్లు తెలిపారు.ఈ ఘటన బెంగళూరులో ఆటో డ్రైవర్లు, బైక్ ట్యాక్సీల మధ్య పెరుగుతున్న ఘర్షణ వాతావరణానికి, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ఆందోళనలకు అద్దం పడుతోంది. దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మీరు జెన్ జీ కాదు: సీజేపీ నేతలతో ఢిల్లీ హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు

జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపుపై పిటిషన్
పిటిషనర్లు జెన్Z్ కాదంటూ న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు
హైకోర్టు సూచనతో పిటిషన్ వాపస్ తీసుకున్న సీజేపీ నేతలు



న్యూఢిల్లీ,అక్టోబర్21,(సామాన్యుడి అస్త్రం)

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా తమ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం వెనక్కి తీసుకున్నారు. ప్రత్యామ్నాయ న్యాయపరమైన మార్గాలు అందుబాటులో ఉండగా నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం ప్రశ్నించడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు.జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన కేసులో అరెస్టయిన సౌరవ్ దాస్ (27), అశుతోష్ రంకా (32) జ్యుడీషియల్ కస్టడీని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిటిషనర్ల వయసు గురించి న్యాయవాది చెప్పగా, 'అయితే మీరు జెన్ జీ కాదు' అని అన్నారు. రివిజన్ పిటిషన్ వేసే అవకాశం ఉన్నప్పుడు, ఆర్టికల్ 226 కింద నేరుగా హైకోర్టుకు రావడంపై ఆయన ప్రశ్నించారు. “ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ ఫలితం కోసం వేచి చూడటం మంచిది” అని ధర్మాసనం సూచించింది. హైకోర్టు సూచనను పరిగణనలోకి తీసుకున్న పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో వారి పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

షుగర్ ఉన్నవారు భోజనం ఎలా చేయాలి?

భోజనాన్ని పీచు పదార్థాలున్న కూరగాయలతో ప్రారంభించాలని నిపుణుల సూచన
తర్వాత ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సలహా
కార్బోహైడ్రేట్లను చివర్లో తీసుకోవడం కొందరికి ఉపయోగపడవచ్చంటున్న స్టడీస్
కార్బోహైడ్రేట్ల పరిమాణం, రకం రెండూ ముఖ్యమేనని వెల్లడి
చక్కెర కలిపిన పానీయాలను పరిమితం చేయడం చాలా మేలు



షుగర్ ఉన్నవారు ఏం తింటున్నారన్నదే కాదు.. భోజనాన్ని ఏ క్రమంలో తీసుకుంటున్నారన్నది కూడా రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం చూపవచ్చు. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లు తీసుకున్న తర్వాత రక్తంలో గ్లూకోజ్ వేగంగా పెరగకుండా ఉండేందుకు ఆహారాన్ని సరైన క్రమంలో తినడం ఉపయోగపడుతుంది. ముందుగా పీచు పదార్థాలు, తర్వాత ప్రోటీన్ ఉన్న ఆహారం, చివరగా కార్బోహైడ్రేట్లు తీసుకోవడం ఒక మంచి పద్ధతిగా సూచిస్తున్నారు. అయితే, ఈ విధానం వైద్యులు సూచించిన మందులకు ప్రత్యామ్నాయం కాదు.

ముందుగా పీచు పదార్థాలు తీసుకోండి

భోజనాన్ని పీచు పదార్థాలు అధికంగా ఉండే కూరగాయలతో ప్రారంభించడం మంచిది. ముఖ్యంగా పిండి పదార్థాలు తక్కువగా ఉండే కూరగాయలు, ఆకుకూరలు ఉపయోగపడతాయి. పీచు పదార్థాలు జీర్ణక్రియను నెమ్మదింపజేసి, ఆహారం నుంచి చక్కెర రక్తంలోకి చేరే వేగాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో భోజనం తర్వాత రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరిగే అవకాశం తగ్గవచ్చు.

తర్వాత ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు

కూరగాయల తర్వాత ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవచ్చు. పప్పులు, గుడ్లు, చేపలు, చక్కెర కలపని పెరుగు వంటి పదార్థాలు ప్రోటీన్‌కు మంచి వనరులు. గింజలు, విత్తనాల వంటి ఆహారాల్లోనూ ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. ప్రోటీన్, కొవ్వులు జీర్ణక్రియ వేగాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రోటీన్ తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉండవచ్చు. అయితే ఏ ఆహారం ఎంత తీసుకోవాలన్నది వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

చివరగా కార్బోహైడ్రేట్లు

అన్నం, రొట్టెలు, ఇతర ధాన్యాలతో చేసిన పదార్థాలు కార్బోహైడ్రేట్లకు ప్రధాన వనరులు. వీటిని భోజనం చివర్లో తీసుకోవడం వల్ల కొందరిలో భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరిగే వేగం తగ్గవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే, కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. వాటి రకం, పరిమాణంపై దృష్టి పెట్టాలి. తృణధాన్యాలు, తక్కువగా శుద్ధి చేసిన ధాన్యాల వంటి ఆహారాలను ఎంచుకోవడం మంచిది. మైదా, చక్కెర అధికంగా ఉండే చిరుతిళ్లను పరిమితం చేయాలి.

భోజన క్రమంతో పాటు ఈ జాగ్రత్తలూ ముఖ్యం

ఆహారాల మధ్య విరామం: కూరగాయలు, ప్రోటీన్ తీసుకున్న వెంటనే కార్బోహైడ్రేట్లు తినకుండా కొంత విరామం ఇవ్వడం ఉపయోగపడవచ్చు. అయితే, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా 5--10 నిమిషాలు వేచి ఉండాలనే నియమానికి బలమైన ఆధారాలు పరిమితంగా ఉన్నాయి.డ్రింక్స్ విషయంలో జాగ్రత్త: చక్కెర కలిపిన పానీయాలు, పండ్ల రసాల్లోని కార్బోహైడ్రేట్లు రక్తంలో గ్లూకోజ్‌ను వేగంగా పెంచవచ్చు. వీటికి బదులుగా నీటిని ఎంచుకోవడం మంచిది.


భోజనం తర్వాత నడక:

భోజనం ముగిసిన తర్వాత 10 నిమిషాల పాటు నడవడం రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడవచ్చు.

మందులు ఆపకండి:

ఆహారాన్ని ఏ క్రమంలో తీసుకున్నా, వైద్యులు సూచించిన మందులు లేదా ఇన్సులిన్‌ను వారి సలహా లేకుండా మార్చకూడదు.మొత్తంగా, డయాబెటిస్ నియంత్రణలో ఆహార పరిమాణం, ఆహార నాణ్యత, శారీరక శ్రమ, మందులు అన్నీ కీలకమే. భోజన క్రమాన్ని మార్చడం కొంతమందికి అదనపు ప్రయోజనం అందించవచ్చు. అయితే, అందరిలోనూ ఒకే ఫలితం ఉంటుందని చెప్పలేం.

శరీరంలో నీరు చేరి ఉబ్బరంగా ఉందా?.. మీ వంటగదిలోనే 'వాటర్ వెయిట్'కు చక్కటి పరిష్కారం!



శరీరంలో నీరు చేరడమే 'వాటర్ వెయిట్'
అధిక ఉప్పు, చక్కెర, తక్కువ నీరు తాగడం దీనికి ప్రధాన కారణాలు
నీరు బాగా తాగడం, పొటాషియం ఉన్న ఆహారాలు తినడం పరిష్కారం
వ్యాయామం, జీవనశైలి మార్పులతో వాపులను తగ్గించుకోవచ్చంటున్న నిపుణులు
వాపులు తగ్గకపోతే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని వెల్లడి

చాలామందికి అకస్మాత్తుగా బరువు పెరిగినట్లు, శరీరం ఉబ్బరంగా, ముఖం, కాళ్లు వాచినట్లు అనిపిస్తుంటుంది. దీన్నే 'వాటర్ వెయిట్' లేదా 'ఫ్లూయిడ్ రిటెన్షన్' అంటారు. శరీరంలోని కణజాలాల్లో అదనపు ద్రవాలు పేరుకుపోవడం వల్ల ఈ సమస్య వస్తుంది. ఇది శరీరంలో కొవ్వు పెరగడానికి పూర్తిగా భిన్నమైనది. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలితో దీని నుంచి సులభంగా బయటపడవచ్చు అని వైద్య నిపుణులు చెబుతున్నారు.మన శరీరంలో దాదాపు 60-70% నీరే ఉంటుంది. ఈ ద్రవాల సమతుల్యత దెబ్బతిన్నప్పుడు వాటర్ వెయిట్ సమస్య మొదలవుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారాల ద్వారా అధికంగా ఉప్పు (సోడియం) తీసుకోవడం, అవసరమైనంత నీరు తాగకపోవడం, చక్కెర లేదా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న పదార్థాలు తినడం వంటివి ప్రధాన కారణాలు. నీళ్లు తక్కువ తాగితే, శరీరం తనలో ఉన్న నీటిని బయటకు పంపకుండా నిల్వ చేసుకుంటుంది. దీనివల్ల కూడా వాపులు వస్తాయి. ఇవే కాకుండా హార్మోన్ల మార్పులు, ఎక్కువసేపు కదలకుండా ఒకేచోట కూర్చోవడం లేదా నిలబడటం వంటివి కూడా శరీరంలో నీరు చేరడానికి దారితీస్తాయి. ముఖం ఉబ్బడం, చేతులు, పాదాల్లో వాపు, పొట్ట ఉబ్బరంగా అనిపించడం దీని సాధారణ లక్షణాలు.

వాటర్ వెయిట్ తగ్గించుకోవడం ఎలా?

వాటర్ వెయిట్‌ను నియంత్రించడానికి కొన్ని సులభమైన మార్గాలున్నాయి. చాలామంది వాపులున్నాయని నీళ్లు తాగడం మానేస్తారు, కానీ అది పొరపాటు. రోజూ తగినంత నీరు తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన అదనపు సోడియం మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. దీంతో వాపులు తగ్గుతాయి.ఆహారంలో ఉప్పు వాడకాన్ని గణనీయంగా తగ్గించాలి. ప్యాకేజ్డ్, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. వాటికి బదులుగా పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. పొటాషియం శరీరంలో సోడియం శాతాన్ని నియంత్రించి ద్రవాల సమతుల్యతను కాపాడుతుంది. ఆకుకూరలు, కీరదోస, క్యాబేజీ, వెల్లుల్లి, నిమ్మకాయలు వంటివి ఆహారంలో చేర్చుకోవడం మంచిది.క్రమం తప్పని శారీరక శ్రమ, తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీంతో కణజాలాల్లోని ద్రవాలు కదిలి వాపులు తగ్గుతాయి. ఆయుర్వేదంలో సూచించినట్లుగా నూనెలతో మసాజ్ చేసుకోవడం వల్ల కూడా లింఫాటిక్ వ్యవస్థ ఉత్తేజితమై వాపులు తగ్గే అవకాశం ఉంది.

వైద్యుడిని ఎప్పుడు సంప్రదించాలి?

సాధారణంగా వాటర్ వెయిట్ తాత్కాలికమే. కానీ, ముఖం లేదా కాళ్లలో వాపులు దీర్ఘకాలం పాటు తగ్గకుండా, తీవ్రంగా ఇబ్బంది పెడుతుంటే ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదు. కొన్నిసార్లు ఇది కిడ్నీ, గుండె, లేదా కాలేయ సంబంధిత సమస్యలకు సంకేతం కావచ్చు. అందుకే, వాపులు కొన్ని రోజులైనా తగ్గకపోతే వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

బెండకాయలోని జిగురుతో కొలెస్ట్రాల్ తగ్గుతుందా?

బెండకాయలో కరిగే పీచు పదార్థంతో జీర్ణక్రియ, మల విసర్జనకు తోడ్పాటు
పేగుల్లోని మంచి సూక్ష్మజీవులకు ఈ పీచుతో ఎంతో మేలు
బెండకాయ కొలెస్ట్రాల్ నియంత్రణకు ఉపయోగపడే అవకాశం
పిత్త ఆమ్లాల విసర్జనలో పీచుది కీలక పాత్ర
కొలెస్ట్రాల్‌పై బెండకాయ ప్రభావం విషయంలో మరిన్ని అధ్యయనాలు అవసరం

బెండకాయ అంటే ఇష్టపడేవారు చాలామందే ఉంటారు. అయితే కొందరు మాత్రం దాని జిగురు కారణంగా తినడానికి ఇష్టపడరు. కానీ ఆ జిగురులోనే ఆరోగ్యానికి మేలు చేసే గుణాలు ఉన్నాయని జీర్ణకోశ నిపుణులు చెబుతున్నారు. బెండకాయలోని పీచు పదార్థం జీర్ణక్రియకు తోడ్పడటంతో పాటు కొలెస్ట్రాల్ నియంత్రణలోనూ ఉపయోగపడే అవకాశం ఉందని వివరిస్తున్నారు.బెండకాయ నీటితో కలిసినప్పుడు జెల్‌లా మారి కరిగే పీచు పదార్థం అందులో ఉంటుంది. దీనినే మ్యూసిలేజ్ అంటారు. బెండకాయకు జిగురు స్వభావం రావడానికి ఇదే కారణం. ఈ పీచు పదార్థం వల్ల జీర్ణవ్యవస్థకు పలు ప్రయోజనాలు కలగవచ్చు.

మలబద్ధకానికి ఉపశమనం

బెండకాయలోని కరిగే పీచు పదార్థం మల విసర్జన సాఫీగా జరిగేందుకు తోడ్పడుతుంది. పేగుల్లో అది ముందుకు కదలడానికి పీచు ఉపయోగపడుతుంది. దీంతో మలబద్ధకం సమస్యను నివారించడంలో సహాయపడవచ్చు. అయితే తగినంత నీరు తాగడం, సమతుల ఆహారం తీసుకోవడం కూడా ముఖ్యం.

సుక్రోజ్, గ్లూకోజ్, ఫ్రక్టోజ్.. ఈ మూడు చక్కెరల మధ్య తేడా ఏంటి?



ఒక గ్లూకోజ్, ఒక ఫ్రక్టోజ్ అణువుతో ఏర్పడేదే సుక్రోజ్
గ్లూకోజ్ శరీరానికి ప్రధాన శక్తి వనరుల్లో ఒకటి
ఫ్రక్టోజ్ పండ్లు, తేనెలో సహజంగా లభిస్తుంది
అదనపు చక్కెరలను అధికంగా తీసుకుంటే ఆరోగ్య సమస్యల ప్రమాదం
సంపూర్ణ పండ్లలోని ఫ్రక్టోజ్‌ను చక్కెర కలిపిన పానీయాలతో సమానం కాదు

చక్కెర అంటే ఒకటే అనుకుంటున్నారా? నిజానికి సుక్రోజ్, గ్లూకోజ్, ఫ్రక్టోజ్.. ఇవన్నీ చక్కెరలే అయినా, వాటి రసాయన నిర్మాణం, శరీరంలో జీర్ణమయ్యే విధానం, ఆరోగ్యంపై చూపే ప్రభావాలు వేర్వేరుగా ఉంటాయి. ముఖ్యంగా చిన్నారులకు ఇచ్చే ఆహారంలో అదనపు చక్కెరల వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరంపై చర్చ జరుగుతోంది. ఆరు నెలలలోపు శిశువులకు ఇచ్చే ఆహారంలో సుక్రోజ్, ఫ్రక్టోజ్ కలపడాన్ని నిషేధించే ప్రతిపాదనను భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ముందుకు తెచ్చింది. చిన్న వయసులోనే అదనపు చక్కెరలకు అలవాటు పడకుండా చూడటం ఈ ప్రతిపాదన లక్ష్యం.

సుక్రోజ్, గ్లూకోజ్, ఫ్రక్టోజ్ మధ్య తేడా ఏంటి?

ఈ మూడు చక్కెరలు దాదాపు ఒకే స్థాయిలో కేలరీలను అందిస్తాయి. పండ్లు, కూరగాయలు, ధాన్యాల వంటి ఆహారాల్లో సహజంగా లభిస్తాయి. అదే సమయంలో ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల్లోనూ వీటిని కలుపుతారు. అయితే, శరీరం వీటిని ప్రాసెస్ చేసే విధానం వేర్వేరుగా ఉంటుంది.

1. సుక్రోజ్: మనం సాధారణంగా వాడే చక్కెర

ఇంట్లో టీ, కాఫీల్లో వేసుకునే సాధారణ చక్కెరనే సుక్రోజ్ అంటారు. ఇది ఒక గ్లూకోజ్ అణువు, ఒక ఫ్రక్టోజ్ అణువుతో ఏర్పడిన చక్కెర. చెరకు, చక్కెర దుంపల నుంచి దీన్ని ఎక్కువగా తయారు చేస్తారు. పండ్లు, కూరగాయల్లోనూ సహజంగా ఉంటుంది.స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లు, బ్రేక్‌ఫాస్ట్ సీరిల్స్, శీతల పానీయాలు, ఇతర ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల్లో సుక్రోజ్‌ను అదనంగా కలుపుతారు. ఇది శరీరంలోకి వెళ్లిన తర్వాత చిన్నపేగులోని ఎంజైమ్‌ల సాయంతో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌గా విడిపోతుంది. ఈ రెండు చక్కెరలు వేర్వేరుగా శరీరంలో ప్రాసెస్ అవుతాయి.

2. గ్లూకోజ్: శరీరానికి తక్షణ శక్తినిచ్చే చక్కెర

గ్లూకోజ్.. ఇది కూడా చక్కెరకు మరో రూపం. శరీరంలోని కణాలకు శక్తినిచ్చే ప్రధాన ఇంధనాల్లో ఇదొకటి. ముఖ్యంగా మెదడు సాఫీగా పనిచేయడానికి రక్తంలో తగినంత గ్లూకోజ్ ఉండాలి. కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే అన్నం, రొట్టెలు, ఇతర ధాన్యాల ఆహారాన్ని జీర్ణం చేసినప్పుడు శరీరానికి గ్లూకోజ్ లభిస్తుంది. కొన్ని ప్యాకేజ్డ్ ఆహారాల్లో డెక్స్‌ట్రోజ్ పేరుతోనూ దీన్ని కలుపుతారు.గ్లూకోజ్ చిన్నపేగు నుంచి నేరుగా రక్తంలోకి చేరుతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. వాటిని నియంత్రించేందుకు క్లోమగ్రంథి ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. గ్లూకోజ్ అధికంగా తీసుకోవడం, ముఖ్యంగా మొత్తం ఆహారంలో అదనపు చక్కెరలు ఎక్కువగా ఉండటం, రక్తంలో చక్కెర నియంత్రణపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

3. ఫ్రక్టోజ్: పండ్లలో సహజంగా ఉండే చక్కెర

ఫ్రక్టోజ్‌ను సాధారణంగా ఫ్రూట్ షుగర్ అని పిలుస్తారు. ఇది పండ్లు, తేనె, కొన్ని కూరగాయల్లో సహజంగా లభిస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారాల్లో హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ రూపంలోనూ ఉపయోగిస్తారు.గ్లూకోజ్‌తో పోలిస్తే ఫ్రక్టోజ్ రక్తంలో చక్కెర స్థాయిలను తక్షణం పెంచే ప్రభావం తక్కువగా ఉంటుంది. అయితే, దీనిని ఎక్కువగా తీసుకున్నప్పుడు కాలేయంపై అదనపు భారం పడవచ్చు. ముఖ్యంగా చక్కెర కలిపిన పానీయాలు, అధిక చక్కెర ఉన్న ప్రాసెస్ చేసిన ఆహారాల ద్వారా ఫ్రక్టోజ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం, ట్రైగ్లిజరైడ్ల స్థాయిలు పెరగడం వంటి సమస్యల ప్రమాదం పెరగవచ్చు.అయితే, పండ్ల ద్వారా లభించే ఫ్రక్టోజ్‌ను చక్కెర కలిపిన పానీయాలతో సమానంగా చూడకూడదు. సంపూర్ణ పండ్లలో పీచు పదార్థాలు, విటమిన్లు, ఇతర పోషకాలు ఉంటాయి. అందువల్ల పండ్లను సాధారణ మోతాదులో తీసుకోవడం ఆరోగ్యకరమైన ఆహారంలో భాగం.

ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతాయి?

గ్లూకోజ్:

శరీరానికి శక్తినిస్తుంది. అయితే రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండటం దీర్ఘకాలంలో ఇన్సులిన్ నిరోధకత, టైప్-2 మధుమేహం వంటి సమస్యలను తెచ్చి పెట్టే ప్రమాదం ఉంది.

ఫ్రక్టోజ్:

పండ్లలో సహజంగా లభించే ఫ్రక్టోజ్ సాధారణంగా సమతుల్య ఆహారంలో భాగమే. అయితే అదనపు చక్కెరల రూపంలో అధికంగా తీసుకుంటే కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు పెరగడం వంటి సమస్యలకు దోహదపడవచ్చు.

సుక్రోజ్:

అధికంగా తీసుకుంటే బరువు పెరగడం, దంతక్షయం, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల ప్రమాదం పెరుగుతుంది. ఎందుకంటే ఇది జీర్ణమైన తర్వాత గ్లూకోజ్, ఫ్రక్టోజ్ రెండింటినీ శరీరానికి అందిస్తుంది.

చక్కెర వినియోగాన్ని ఎలా తగ్గించాలి?

ఆరోగ్యంగా ఉండాలంటే చక్కెర కలిపిన శీతల పానీయాలు, ప్యాకేజ్డ్ జ్యూస్‌లు, స్వీట్లు, అధిక చక్కెర ఉన్న ప్రాసెస్ చేసిన ఆహారాల వినియోగాన్ని తగ్గించాలి. పండ్ల రసాల కంటే సంపూర్ణ పండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార పదార్థాల ప్యాకెట్లపై ఉన్న పోషక విలువల వివరాలను చదివి, అదనపు చక్కెర ఎంత ఉందో తెలుసుకోవాలి.ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. చక్కెర ఏ రకానికి చెందినదన్నదే కాదు.. ఎంత మోతాదులో తీసుకుంటున్నాం? ఏ ఆహారం ద్వారా తీసుకుంటున్నాం? అన్నదీ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.

నా బాడీ.. నాకు గర్వం!

సోషల్ మీడియా వేదికగా తన శరీరాకృతిపై వస్తున్న అసభ్యకర కామెంట్లు, వైరల్ అవుతున్న వీడియోలపై టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పాయల్ రాజ్‌పూత్ ఎక్స్‌లో విరుచుకుపడింది. బాడీ షేమింగ్‌కు పాల్పడుతున్న నెటిజన్లకు ఆమె గట్టిగా బుద్ధి చెప్పింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాయల్ రాజ్‌పూత్ తన ఎక్స్ అకౌంట్‌లో పెట్టిన పోస్టు కలకలం రేపుతోంది. 'మీకు సిగ్గుండాలి.నా శరీరం గురించి అసహ్యకరమైన కామెంట్లు చేస్తూ, ఆ వీడియోలను షేర్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ సిగ్గుండాలి. నా శరీరం, నా గర్వం. ఇవి మీ చర్చలకు, మీ అభిప్రాయాలకు లేదా మీ అశ్లీలతకు సంబంధించిన విషయాలు కావు.మీ పరిధిలో మీరు ఉండండి, మీ పని మీరు చూసుకోండి' అని పాయల్ పోస్టు చేసింది. పాయల్ తాజా పోస్టు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల హీరోయిన్ల బాడీని ట్రోల్స్ చేయడం, వాళ్ల వీడియోలను ఏఐతో మార్ఫింగ్ చేసి పోస్టు చేయడం ఎక్కువైంది. ఈ విషయంపై ఇప్పటికే డిబేట్ జరుగుతోంది. ఈ సమయంలో హీరోయిన్ పాయల్ ట్వీట్ చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది.



16 లక్షలు దాటిన టికెట్ సేల్స్!




థియేటర్లలో కుటుంబ ప్రేక్షకుల ఆదరణ సినిమాలకు మరింత బలాన్ని ఇస్తోంది. తాజాగా 'రణబాలి', 'జయమ్మ' చిత్రాలకు ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు సినిమాలకు సంబంధించిన టికెట్ బుకింగ్స్‌లోనూ మంచి జోరు కనిపిస్తోంది.బుక్‌మైషో , డిస్ట్రిక్ట్ యాప్‌ల ద్వారానే 'రణబాలి', 'జయమ్మ' చిత్రాలకు కలిపి 16 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు వెల్లడించారు. ఈ సంఖ్య రెండు సినిమాల కలిపిన అమ్మకాలకా, లేక మరేదైనా నిర్దిష్ట కాలానికి సంబంధించినదా అనే వివరాలను ప్రచురణకు ముందు ధ్రువీకరించడం అవసరం.ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వేదికలపై కనిపిస్తున్న ఈ స్పందన, సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తిని సూచిస్తోంది.

అంతుచిక్కని రహస్యాల ఛేదనలో



దైవశక్తి చుట్టూ అల్లుకున్న అంతుచిక్కని రహస్యాలు, నిధి అన్వేషణ నేపథ్య కథాంశంతో రూపొందిస్తున్న మైథలాజికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఈ సినిమాను డిసెంబర్ 4న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు.ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాగచైతన్య గుబురు గడ్డంతో నుదుటిపై ఎర్రని తిలకాన్ని ధరించి సరికొత్త అవతారంలో కనిపిస్తున్నారు. మార్మిక, ఆధ్యాత్మిక అంశాలు ప్రధానంగా నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే ఈ కథలో అంతుచిక్కని అనేక రహస్యాలు ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. హీరో నాగచైతన్య ట్రెజర్ హంటర్‌గా ధైర్యసాహసాలు మూర్తీభవించిన వ్యక్తి పాత్రలో కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, స్పర్శ్‌శ్రీవాస్తవ, జయరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి లోక్‌నాథ్, నిర్మాత: బీవీఎస్ఎన్ ప్రసాద్, దర్శకత్వం: కార్తీక్ దండు.

రామ్‌చరణ్‌కు జోడీగా



సైయారా' సినిమాతో దేశవ్యాప్తంగా యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది బాలీవుడ్ భామ అనీత్ పడ్డా. చూడముచ్చటైన అందం, అభినయం కలబోతగా ఆమె నటన అందరిని ఆకట్టుకుంది. తాజాగా ఈ భామ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. 'రంగస్థలం'తో సంచలనం సృష్టించిన అగ్ర హీరో రామ్‌చరణ్- క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే.ఈ సినిమాలో కథానాయికగా పలువురు బాలీవుడ్ భామల పేర్లు తెరపైకొస్తున్నాయి. తొలుత 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ ఈ సినిమాలో నటిస్తుందని వార్తలొచ్చాయి. తాజాగా యువ నాయిక అనీత్ పడ్డా పేరు తెరపైకి వచ్చింది. ఈ ఇద్దరు బాలీవుడ్ భామల్లో..దర్శకుడు సుకుమార్ ఎవరిని కథానాయికగా ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రం ఈ నెలలోనే లాంఛనంగా ప్రారంభం కానున్నట్లు సమాచారం.

బాక్సాఫీస్ వద్ద 'టైగర్' వేట..

సూపర్ స్టార్ రజనీకాంత్ తన బాక్సాఫీస్ స్టామినాను మరోసారి నిరూపించారు. ఆయన నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' విడుదలైన కేవలం ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 541 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ అద్భుతమైన ప్రదర్శనతో 2026లో ఇప్పటివరకు విడుదలైన భారతీయ చిత్రాల్లో మూడో అతిపెద్ద హిట్‌గా నిలిచింది.ట్రేడ్ వర్గాల నివేదికల ప్రకారం, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామా ఆరో రోజైన మంగళవారం ఇండియాలో రూ. 45.55 కోట్ల నెట్ వసూలు చేసింది. దీంతో దేశీయంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 287.80 కోట్లకు (సుమారు రూ. 337 కోట్ల గ్రాస్) చేరాయి. దసరా పండుగ సెలవులు సినిమా వసూళ్లకు భారీగా దోహదపడ్డాయి. మరోవైపు, ఓవర్సీస్ మార్కెట్ల నుంచి సుమారు రూ. 204 కోట్లు రావడంతో ప్రపంచవ్యాప్త గ్రాస్ రూ. 541 కోట్లు దాటింది.ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో 'ధురంధర్ 2' (రూ. 1,800 కోట్లకు పైగా), 'దృశ్యం 3' (రూ. 556 కోట్లు) తర్వాత 'జైలర్ 2' మూడో స్థానంలో ఉంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం 2023లో బ్లాక్‌బస్టర్ అయిన 'జైలర్'కు సీక్వెల్‌గా తెరకెక్కింది. ఇందులో రజినీకాంత్ 'టైగర్ ముత్తువేల్ పాండియన్' పాత్రను కొనసాగించగా, రమ్యకృష్ణ, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, యోగిబాబు కీలక పాత్రల్లో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. థియేటర్లలో ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉందని దర్శకుడు నెల్సన్ సంతోషం వ్యక్తం చేశారు. ఇదే జోరు కొనసాగితే, 'జైలర్' మొదటి భాగం లైఫ్‌టైమ్ కలెక్షన్లను కూడా ఈ చిత్రం అధిగమిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రామాయణం ఈవెంట్‌లో సాయి పల్లవి



నటి సాయి పల్లవి తన సహజమైన అందం, నటనతో పాటు సంప్రదాయ వస్త్రధారణతోనూ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటారు. తాజాగా ఆమె మరోసారి తన చీరకట్టుతో అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్‌లో జరిగిన 'రామాయణం' తెలుగు ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో సాయి పల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ చిత్రంలో ఆమె సీత పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే.ఈ వేడుకకు సాయి పల్లవి ఊదా-లావెండర్ కలయికలో ఉన్న అందమైన టిష్యూ సిల్క్ చీరలో హాజరయ్యారు. ఆ చీరకు బంగారు వర్ణంతో చేసిన భారీ అంచు, జరీ పనితనం ప్రత్యేక అందాన్ని తెచ్చిపెట్టాయి. టిష్యూ సిల్క్ ఫ్యాబ్రిక్ కావడంతో చీరలో ఓ ప్రత్యేకమైన మెరుపు కనిపించింది. దీనికి సరిగ్గా సరిపోయేలా అదే రంగు బ్లౌజ్‌ను ధరించారు. ఈ బ్లౌజ్‌కు ముందు, వెనుక, చేతులపై బంగారు రంగు ఎంబ్రాయిడరీ వర్క్ చేశారు. మోచేతుల వరకు ఉన్న చేతులు, మాండరిన్ కాలర్ డిజైన్ ఆమె లుక్‌ను మరింత హుందాగా మార్చాయి.ఎప్పటిలాగే తన లుక్‌ను సింపుల్‌గా, సంప్రదాయబద్ధంగా ఉంచుకున్నారు. చెవులకు డ్రాప్ ఇయర్ రింగ్స్, చేతులకు అందమైన కడియాలు (కాడలు), చేతిలో జపమాల పట్టుకుని కనిపించారు. తన సహజమైన రింగుల జుట్టును సాఫ్ట్‌గా స్టైల్ చేసుకుని, అతి తక్కువ మేకప్‌తో దర్శనమిచ్చారు. గులాబీ రంగు ఐషాడో, లేత రంగు లిప్‌స్టిక్, నుదుటిపై చిన్న ఎర్ర బొట్టుతో తన రూపాన్ని పూర్తిచేశారు.నితేష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న 'రామాయణం'లో రాముడిగా రణబీర్ కపూర్ నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్ల కోసం సాయి పల్లవి మొదటి నుంచి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా చీరకట్టులోనే కనిపిస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.